

'చెప్పులోని రాయి, చెవిలోని జోరీగ, ఇంటిలోని పోరు ఇంతింత గాదయా!', అని శతక కర్త స్వానుభవంతో వ్రాసినట్లు తోస్తూవుంది. 'శశి' లో డిసెంబరు నెలలో వ్రాసిన వ్యాసము పర్యవసానముగా ఇంట్లో ఒక చిన్న తుపాను రేగింది.

"ఏమండీ! మిమ్మల్ని పరాయివాళ్ళచే తిట్టించుకోవడమే కాకుండా నా చేత గూడా ఆ విధంగా అనిపించడం బాగుందా? నేను మీ వ్రాతలకూ చేతలకూ అడ్డు వస్తున్నానా? అసలు ఒక

వేళ ఆ విధంగా ఉన్నా నన్ను ఆరడి పెడతారా? రేపు బాలసరస్వతమ్మ గారిని ఏలాగా చూచేదీ? ఏమమ్మా! మీ మగడు మా సోదరుడి మాదిరిగా మాకు సహాయపడుతూంటే నీకు గిట్టడం లేదా అని ఆమెగారంటే ఏమని చెప్పేది? నన్ను రచ్చ కీడ్వడం మీకు న్యాయమేనా?" అంటూ మా ఆవిడ రాజేశ్వరి చిన్న కర్టక్ లెక్చరు దంచింది.

"అవన్నీ కథలు గదా! నీకు అందువల్ల ఏం లోకువ కల్గింది గనుక? నిన్ను గొప్పగా పొగి డాను కదా! నీవు నూనె వంకాయ ఎక్స్పర్టు అని వ్రాశాను కదా. నీవు అట్లా అంటూన్నా నేను కథలు వ్రాస్తూన్నానంటే నా మగతనం తెలుస్తూనే వుంది గదా. వాళ్ళు మాత్రం నిన్నే మంటారు గనుక?" అని బదులు చెప్పాను.

అయితే మాత్రం ఏమి లాభం? మూతి విరుపులూ, రుసరుసలూ అధికమైంది.

ఇక ఇంట్లో ఉంటే లాభం లేదనుకొని బయ టికి కదిలాను. వెళ్ళానే గాని మనసు మనసులో లేదు. నాకేమో నేను వ్రాసిన దానిలో తప్పు కనబడడం లేదు. నాపేరెలాగూ గ్రంధాలకు యెక్కింది గాని, నా సహధర్మచారిణి పేరును గూడా చిరస్థాయిగా చేద్దామని అనుకుంటే కథ అడ్డం తిరిగింది. అయినా ఈ విధంగా ఇంట్లో ప్రతికూల వాతావరణం కనబడుతుందని నేను కలలో గూడా అనుకోలేదు. పోనీలే ఏమి జరుగు తుందో చూద్దామనుకున్నాను.

క్లబ్బుకు వెళ్ళాను. ఎప్పుడూ బాగా వచ్చే కార్డులు ఏమీ వాటంగా రాలేదు. లాభం శూ న్యం. ఎప్పుడూ నైపుణ్యంతో చేతిలో బంగారం గా మారే ముక్కలు తిరగబడసాగినాయి. నిజా నికి బుర్ర సరిగా పనిచేయలేదు. ఇంతకూ ఇం ట్లో లెక్చరే కారణమనుకొన్నాను. ఫెయిలయిన మురిపెంపుటల్లుళ్ల విషయంగా అత్తగార్లు అయ్యవారికి భార్యపై అలుక వచ్చి మార్కులు తక్కువవేసి ఉంటాడని చెప్పడంలో సబబు ఉం దని నా పద్ధతిని క్లబ్బు సెక్రటరి చూచాడు. "ఏం సార్, పరధ్యానంలో ఉన్నారు? ఇస్పోకు ముక్కకీ త్రుంపు తునకకీ భేదం కనబడడం లేదా?" అన్నాడు. ఏదో సమాధానం చెప్పాను.


"బుర్ర వేడెక్కిందండీ, ఆఫీస్ పనితీవ్రంవల్ల అంతే... మరేమీలేదు'' అన్నట్లు జ్ఞాపకం.

## పాత బంగారం

1950వ దశకంలో ఒక మంచి తెలుగు మాసపత్రికగా వెలుగొందిన 'శశి' గురించి చాలామందికి తెలిసేవుంటుంది. శ్రీ వి.యస్. వేంకటనారాయణగారు నెల్లూరు, తిరుపతిలలో ఉపాధ్యాయునిగా, ప్రధానోపాధ్యాయునిగా పని చేసేవారు. వీరు తమ ఆధ్యాత్మిక రచనలద్వారా అందరికీ సుపరిచితులే. తిరుపతిలో త్యాగరాజ ఆరాధనోత్సవాల్లో కేవలం వీరి వందన సమర్పణ కోసమే అందరూ చివరిదాకా వేచి ఉండే వారంటే అతిశయోక్తి కాదు. శ్రీ వేంక టేశ్వర సుప్రభాతమ్ మీద ఆంగ్ల వ్యాఖ్యానం, శ్రీకాళహస్తీశ్వర స్వామి శతనామాజ్ఞ మాలిక వంటి ఎన్నో రచనలు ఆయన ప్రతిభకు అద్దం పట్టాయి. వీరు 1950 ప్రాంతాల్లో ఎన్నో తెలుగు రచనలు చేశారు, హాస్య కథలూ వ్రాసారు. వాటిలో 1957 జనవరిలో వచ్చిన 'పర్యవసానం' చెప్పుకోదగ్గది. మిగిలిన రచన లేవీ అందుబాటులో లేవుకానీ ఈ రచన దొరి కింది. 1950 దశకంలో హాస్యరచనలు ఎలా వుండేవో ఈ 'గుత్తివంకాయ' ఇతివృత్తంతో వచ్చిన కథ మనకు చెబుతుంది. 50 ఏళ్ళ క్రితం కథ ఇది!

వి.యస్. వేంకటనారాయణ

# ఓ సరదా చిత్రం!



వెంటనే క్లబ్బు వదిలి అలా ప్రక్క థియేటరు మీదుగా పయనం సాగించాను.

అప్పుడే రికార్డు వినబడింది. "ఎంత నేర్చినా! ఎంత చూచినా! కాంతదాసులే!" అనే పాట ఫలశ్రుతి భాగానే వుంది.

ఎదురుగా ఏసుదాస్ సైకిలులో వస్తున్నాడు. కరిమాణిక్యంగా ఉండే ఆ స్థూల కాయాన్ని ఏలాగో శ్రమింపజేస్తు సైకిలు మందగమనంతో నడిపిస్తు వచ్చాడు.

"సార్! ఒక నిమిషం" అని సైకిలు దిగి ప్రస్తావించాడు.

"ఏమండీ! ఏసుదాస్‌గారూ! ఒక నిమిషములో ఏం మాట్లాడగలం? ఇపుడు సాయంత్రమేగా. ఎంతసేపయినా మాట్లాడుకోవచ్చును. రండి! టీషాపు దగ్గిరే వుంది." అన్నాను.

సైకిలు దిగి గమనాయాసంతో శరీరాన్ని బరువుగా ఈడుస్తూ, సైకిలు తోసుకుంటూ, మాట్లాడుతూ వచ్చాడు.

"మరి మీరు ఏమీ అనుకోవద్దండీ. మీవల్ల నాకొక సహాయం కావాలి"

"దానికేమండీ! మీరేం సంకోచపడొద్దు ఏం కావాలో అడగండి చేస్తాను" అన్నాను. గయోపాఖ్యానంలో అర్జునుడు గయునికి అభయమిచ్చిన వైఖరిలో.

"ఏమీ లేదండి! నా భార్య దేవకృపావతి మిస్సెమ్మ దగ్గఱ పనిచేస్తూఉందిలెండి. మా మిషనరీ కాబ్ వెబ్ దొరగారు మీకు తెలిసే ఉంటుంది. ఆయన భార్యే మిస్సెమ్మ. కంగుంది కుప్పంలో హెడ్మాష్టరు పని ఖాళీగా వుందండి. నాకు ఆ చాన్సు రావడానికి మీ సహాయం చాలా అవసరమండీ! మీకోసమే నేనిప్పుడు వస్తూండినాను. తాను కోరిన దేవుడు తానే ప్రత్యక్షమైనట్లు అయింది"

"సరేకానీ మిష్టరు యేసుదాస్! నాకు కాబ్ వెబ్ దొరగారి పరిచయమే లేదే – నేనేం చేయగలను?"

"అదే సార్! మీరేమీ రెకమెండు చేయవలసింది లేదండీ. మా మిస్సెమ్మకు నూనె వంకాయ కూర అంటే చాల ఇష్టం సార్! ఆమెను డిన్నరుకు పిలిచాము రేపటికి. ఈ కాలంలో ఉద్యోగానికి మెరిట్ అక్కరలేదని మీలాంటి వారికి బాగా తెలిసిందే గదండీ, పొట్టేపాళ్ళెంలో మా అన్న పాల్ ఉన్నాడు. మంచి సిసలైన వంకాయలు పంపించాడు. మీకు కూడా ఇవ్వాలని అనుకొన్నాను. అయితే ఆ వంటకం చేసే పద్ధతి సరిగ్గా తెలియదని చెప్పింది సార్ దేవకృపామతి! మన అమ్మగారు..."

చస్తిమిరా దేవుడా! అనుకొన్నాను – అసలు పేపర్లోకి ఎక్కించినందులకే నా భార్య నన్ను రావిడిచేసింది. ఇక ఆమెకు ఈ విధంగా ఐ-సి-యస్ (ఇపుడు అసలు ఐసియస్ లేదు కాబ

ట్టి యధేచ్ఛగా టైటిల్ను ఉపయోగించవచ్చు, వేరే అర్థం రాదు) పనిని నేను పురమాయిస్తే ఇకనేముంది? హరోహర! ఇదెక్కడి సంకటం తెచ్చిపెట్టావురా భగవంతుడా అనుకొన్నాను – మరి నేరుగా ఏమి భడవా? మేమేం వంటవాళ్ళ మనుకొన్నావా, భద్రం! నోరు శుద్ధంగా ఉంచుకో అని గధమాయిద్దామంటే, ఏసుదాస్ బావమఱది మోజెస్ మా పాఠశాల అకౌంటుచూచే ఆడిటరు. ప్రభుత్వమంటే మా ఆడిటర్లదే ప్రభుత్వం – వారికి అయిష్టంగా ఏమైనా చేశామా ఇక ఏ ఖర్చుకైనాసొడ్డే, ఇది యేవిధంగా పరిణమిస్తుందో?

ఇలాగా మ్రింగాలేక, కక్కా లేక పైకి లోగుట్టు తెలియనీయక, (అందులో నేను యెక్స్పర్టును లెండి) 'చా' తీసుకొంటున్నాను.

"మరేమీ వేరుగా అనుకోకండి. మన అమ్మగారు మా యింటికి వచ్చి వంట చేయవలసిందని నా భావం కాదు – పేపరులో ఆమెను గురించి మీరు వ్రాశారు గదా– దాన్ని చూచి మా ఆవిడ ఆ అమ్మగారిని అడిగి నూనె వంకాయ ఎలా చేయాలో వ్రాయించుకొని వస్తే చాలు, నేను ఒకసారి మిస్సెమ్మకు మెప్ప జెపుతానని అన్నదండి – అందుకోసం మిమ్మల్ని ఆశ్రయించానండీ– మీరు కొంచం దయ పెడితే..."

మీ టి.వి. సీరియల్ ఇంత పాపులర్ కావడానికి కారణమేమిటి? ప్రశ్నించాడు విలేఖరి.

ఏముంది?... సీరియల్ మధ్యలో వచ్చే అడ్వర్టయిజ్‌మెంట్స్‌లో 'ఉచిత ఆఫర్స్' ఎక్కువగా ఉండేవి ఎన్నుకొన్నాం... చెప్పాడు ప్రొడ్యూసర్.

కొంచెం నసిగాను– 'ఇదెక్కడి ప్రారబ్ధమో? రాజేశ్వరికి ఈ విషయంలో ఎలా నచ్చజెప్పడం! నేను చెబితే ఆమె వీధినబొయ్యే శనైశ్చరం మనకెందుకండీ అంటే ఎట్లా, అనుకొన్నాను.


నేను తటపటాయించడం ఏసుదాస్ చూచాడు– "ఏమనుకోవద్దండి– నా ప్రొమోషను మీ చేతిలో ఉందండి – కొంచం నాకోసం – మీకు నావల్ల ఏమి సాయంకావాలంటే దాన్ని తప్పకుండా చేసితీరుతానండి! మా బావమరిది మోజెస్ కూడా మిమ్మల్ని గురించి యెక్కువగా చెబుతూంటాడు" అని పుసలాయించాడు.

అందులో భావం బాగా అర్థమైంది – ఎలాగో బాధ గడవడం తోచలేదు – కాని గాంభీర్యంతో "సరే, అలాగే – దానికేంలేండి – ఒక్క చిటికెలో వ్రాసిపంపిస్తాను లెండి – రేపు రాత్రి కదా డిన్నరు – ఉదయమే తెలుపుతాను లెండి" అని మెల్లగా యేసుదాసును విడిపించుకొని, కార్యసాధనకు భార్యదాసుగా నేను చేయవలసిన హంగామా అంతా ఆలోచించుకుంటూ, ఇంటి ముఖం పట్టాను – రాజేశ్వరికి యేమి యెట్లాగా చెప్పవలసిందీ అనే ధోరణి నిశ్చయం చేసుకొన్నాను. 'వాడు మా ఆడిటర్ బంధువే. వాడితో విరోధపడితే, మా అకౌంట్లలో తప్పు కనిబెట్టే చేతి చిలుము వదులుతుందే?' అని బుకాయిద్దామని తీర్మానించుకొన్నాను.

ఇంటి గడప ఎక్కగానే నాలుగు ఆడగొంతుకలు వినబడ్డాయి.

"వస్తానండి! రాజేశ్వరిగారూ!" అన్నది సేల్సుటాక్సు ఆఫీసరు భార్య మరకతం.

"పోయి వస్తానమ్మా! మా యింటికి వస్తూ పోతూ ఉండండి" అని ప్రక్కన అడ్వకేటు కుంజితపాదం గారి భార్య సుందరవల్లి అమ్మ చెప్పి




వెళ్ళుతున్నది.

మతి యిద్దఱు ముక్కద్దాలూ, హై షూస్ - హ్యాండ్ బ్యాగులూ - లిప్‌స్టిక్ - అంతా మేకప్పు ప్రస్ఫుటంగా కనబడుతూవుంది.

నల్గురూ వెళ్ళేంతవరకు ఇవతల వుండి తొట్రుపాటుతో పంచవర్ష ప్రణాళిక మనసులో మెదలితే ఉండే ముఖ కళవళికతో ఇంట్లోకి వచ్చాను.

ఆశ్చర్యం! మా ఆవిడ రాజేశ్వరి ముసిముసి నవ్వులు నవ్వుతూ ఆహ్వానించింది.

కలయో! వైష్ణవ మాయయో అనిపించింది. "ఏమిటీ విశేషం?" అన్నాను.

"మీరు వ్రాశారే నా విషయం, నాకు చాలా హోదా యేర్పడిందండి. మొన్న వైఢూర్యం ఇంటికి తాంబూలానికి వెళ్ళితే పలకరించినా పలకని మరకతం తనంతట తానుగా వచ్చి, నన్ను బ్రతిమాలి గౌరవించి, నూనె వంకాయ వండే పద్ధతి అడిగి తెలుసుకొని వెళ్ళింది. సుందరవల్లి అమ్మ అప్పడాలు, ఊరగాయలు, ఇవన్నీ కో-ఆపరేటివుగా మహిళా సమాజములో చేస్తాము, నీవు కూడా మెంబరు కావలసిందని పొగిడి వెళ్ళింది. ఆమె యెవరో దేవకృపావతి యట? కూడా నా క్లాస్‌మేట్ రోజ్ మేరీ, సరోజినితో కూడా వచ్చింది. వాళ్ళ మొగుడికి ప్రమోషను కావాలట. అందుకేదో డిన్నరు చేయాలని నూనె వంకాయ వ్యవహారము కనుక్కొని పోయింది" అని రాజేశ్వరి అనగానే నేను ఇంద్రలోకం అందుకొన్నట్లుగా అయింది.

"ఈ ఖ్యాతి అంతా మీవల్లే వచ్చిందండీ. ఏమో అన్నానని కోప్పడలేదు గదా! రండి! నూనె వంకాయ చేశాను. మరీ అధికంగా తిని పలవరించేరు సుమా! అరటి తొక్క బాపతు సీనయ్య, జయ చంద్రారెడ్డి కనబడుతారు. జాగ్రత్త!" అంటూ ఛలోక్తి విసరి రివ్వుమంటూ లోనికెళ్ళింది. ఇక నా మనోభావాన్ని యెలా వర్ణించడం? కాగల కార్యాన్ని గంధర్వులే తీర్చారనుకున్నాను.